సాక్షి
నిజామాబాద్
బుధవారం । 31 । జూలై । 2024



బీసీ డిక్లరేషన్‌ను..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

- 10లో ▸



విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. కేసులు పెరిగిపోతుండడంతో ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /23.9

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

‘అర్బన్’ అభివృద్ధికి నిధులివ్వండి



సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని తన చాంబర్‌లో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అర్బన్ నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రోడ్లు, డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, తాగునీటి సమస్య, స్టాం వాటర్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తదితర అంశాలను సీఎంతో చర్చించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 10 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ కోరారు. నిధుల విడుదలకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాగు చేస్తున్న పంటలకు సస్యరక్షణ చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు డొంకేశ్వర్ రైతువేదిక నుంచి వీక్షించారు. వరి, మొక్కజొన్న పసుపు, సోయా పంటల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని, స్థానిక వ్యవసాయాధికారులు సూచించిన మందులు వాడితే పంటలు చీడపీడల నుంచి రక్షించుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ వీసీలో ఏఈవోలు నరేశ్, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాపాలన దరఖాస్తుల సవరణ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ప్రతి సమస్యను వివరంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎడిట్ ఆప్షన్ అన్నింటికీ ఇస్తే బాగుంటుందని పలువురు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయండి

నిజామాబాద్ రూరల్: రాష్ట్రంలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్‌లకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు చెల్లించాలని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో పంచాయతీరాజ్, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై చర్చ జరిగిన నేపథ్యంలో రాష్ట్ర పీఆర్ కమిషనర్ అనిత, రాంచంద్రన్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు చెల్లించాలని కోరానన్నారు. దీనికి ఆమె స్పందించి ప్రభుత్వం వద్దనే పెండింగ్ వేతనాలు ఆగిపోయాయని సమాధానం ఇచ్చారన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. క్రితం రోజు 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మంగళవారం ఉదయం నుంచి 22వేల క్యూసెక్కులకు పెరిగింది. తర్వాత క్రమంగా తగ్గుతూ సాయంత్రానికి 12వేల క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 433 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1076.3 అడుగుల(35.7 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

రెండో విడత రూ.210 కోట్లు

- జిల్లాలో రుణమాఫీ లబ్ధిదారులు 22,868 మంది
- కలెక్టరేట్‌లో రైతులకు లాంఛనంగా చెక్కుల అందజేత
- రుణమాఫీతో అర్హులైన ప్రతి రైతుకు ప్రయోజనం చేకూరాలి : కలెక్టర్
- సమస్యలుంటే 7288894554, 7288894557 నంబర్లను సంప్రదించాలి
- జిల్లాలోని 31 రైతు వేదికల్లో సంబరాలు



రైతులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, కార్పొరేషన్ చైర్మన్లు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ–2024 రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర సచివాలయం ఆవరణ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీ నిధులను విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధ్యక్షతన లబ్ధిదారులైన రైతులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, బ్యాంకర్లు, సొసైటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా కార్యక్రమాన్ని వీక్షించి, సీఎం సందేశాన్ని తిలకించారు. జిల్లాలోని 31 రైతు వేదికల్లోనూ రుణమాఫీ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం కొనసాగగా, ఎక్కడికక్కడ రైతులు ఉత్సాహంగా పాల్గొని తమ హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తూ, సంబురాలు చేసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు లబ్ధిదారులైన పలువురు రైతులకు రెండో విడత రుణమాఫీ చెక్కులు లాంఛనంగా అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాల్లో రూ. 31వేల కోట్లు జమ చేస్తోందని, ఇందులో భాగంగా మొదటి విడతలో రూ. లక్షలోపు రుణాలు మాఫీ చేయగా, రెండో విడతగా రూ. 1.50 లక్షల్లోపు రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసిందన్నారు. రుణమాఫీ ద్వారా జిల్లాలో మొదటివిడతలో 44,469 మంది రైతు కుటుంబాలకు రూ. 225కోట్ల లబ్ది చేకూర్చగా, రెండోవిడతలో 22,868 మంది రైతు కుటుంబాలకు రూ. 210కోట్లు వారి ఖాతాల్లో జమ చేసిందని కలెక్టర్ వివరించారు. ఎక్కడైనా క్షేత్రస్థాయిలో రైతులకు రుణమాఫీ విషయంలో ఇబ్బందులుంటే, వాటిని పరిష్కరించేందుకు వీలుగా జిల్లాస్థాయిలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇప్పటికే తొలివిడత మాఫీకి సంబంధించి 517 ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. సహాయక కేంద్రాన్ని సంప్రదించేందుకు వీలుపడని రైతులు నేరుగా 72888 94557, 72888 94554 నంబర్లకు ఫోన్‌చేసి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఏ ఒక్క రైతు అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. తొలి, రెండో విడతల్లో రుణమాఫీ పొందిన రైతులందరికీ జిల్లా యంత్రాంగం తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఏవో వాజిద్ హుస్సేన్, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చవాన్, పాపయ్య, కాంగ్రెస్ కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, రైతు సంఘాల నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సంబురాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత పంట రుణమాఫీ చేసింది. రైతుల ఫోన్లకు సందేశాలు కూడా అందాయి. దీంతో మాఫీ జరిగిన రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రైతు వేదికల వద్ద అన్నదాతలు సంబరాలు చేసుకున్నారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. అత్యధికంగా నిజామాబాద్ నియోజకవర్గంలో 6,610 మంది రైతులకు లక్షన్నర లోపు రుణమాఫీ కాగా అత్యల్పంగా నిజామాబాద్ అర్బన్‌లో కేవలం 25 మందికే మాఫీ జరిగింది. అయితే, ప్రభుత్వం విడుదల చేసిన రుణ మాఫీ జాబితాలో కొంతమంది రైతుల పేర్లు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులు, సొసైటీ కార్యాలయాలు, ఏఈవోల వద్దకు వెళ్లి పరిశీలన చేసుకున్నారు. ఇటు జిల్లా వ్యవసాయ శాఖలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు రైతులు ఫోన్లు చేసి ఫిర్యాదులు చేస్తున్నారు.

మండలాల వారీగా రుణమాఫీ వివరాలు

మండలం	రైతులు	మండలం	రైతులు	మండలం	రైతులు
ఆర్మూర్	1,091	వేల్పూర్	642	ధర్పల్లి	820
మాక్లూర్	1,405	ఏర్గట్ల	411	డిచ్‌పల్లి	1,062
నందిపేట్	1,347	చందూర్	414	ఇందల్వాయి	1,310
బాల్కొండ	549	కోటగిరి	1,538	జక్రాన్‌పల్లి	666
భీమ్‌గల్	1,444	మోస్రా	258	ముప్కాల్	965
కమ్మర్‌పల్లి	682	రుద్రూర్	240	నిజామాబాద్ రూరల్	651
మెండోరా	374	వర్ని	510	సిరికొండ	1,136
మోర్తాడ్	522	బోధన్	1,842	నిజామాబాద్ నార్త్	18
ముప్కాల్	251	నవీపేట్	1,156	నిజామాబాద్ సౌత్	07
		రెంజల్	974		
		ఎడపల్లి	583		

సీఎం చేతుల మీదుగా చెక్కు అందుకున్న కుర్నాపల్లి రైతు



సీఎం చేతుల మీదుగా రుణమాఫీ చెక్కును అందుకుంటున్న రైతు గంగాధర్

ఎడపల్లి(బోధన్): రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రుణమాఫీని మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభించగా.. సీఎం చేతుల మీదుగా జిల్లాకు చెందిన రైతు చెక్కును అందుకున్నాడు. ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లికి చెందిన రైతు గంగాధర్ రూ. 1.50 లక్షల చెక్కును తీసుకున్నాడు. ఈ సందర్భంగా రైతు స్పందిస్తూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా చెక్కును అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

చెస్ బాక్సింగ్‌లో రుషాంక్‌రెడ్డికి రెండు గోల్డ్‌మెడల్స్



గోల్డ్‌మెడల్స్ సాధించిన రుషాంక్‌రెడ్డి, క్రీడాకారులు ప్రతిభ, విజయ రాఘవేంద్ర

నిజామాబాద్‌నాగారం: ఆసియా చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్, ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్‌లో కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన పోచారం రుషాంక్‌రెడ్డి సత్తా చాటాడు. ఈ నెల 29న కోల్‌కతాలో నిర్వహించిన ఈ పోటీల్లో రెండు గోల్డ్‌మెడల్స్ సాధించాడు. మాజీ స్పీకర్, మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మనవడు, నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి కుమారుడు. అలాగే సీనియర్ మహిళా విభాగంలో కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన క్రీడాకారిణి వరల్డ్ చాంపియన్ తక్కడ్‌పల్లి ప్రతిభ ఐదు గోల్డ్ మెడల్స్, సబ్ జూనియర్స్ విభాగంలో బాన్సువాడకు చెందిన రుషాంక్ రెడ్డి 2 గోల్డ్ మెడల్స్, సీనియర్ పురుషుల విభాగంలో పిట్లంకు చెందిన తకడ్‌పల్లి విజయ్ రాఘవేంద్ర 2 సిల్వర్ మెడల్స్ సాధించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

బాల్కొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. మంగళవారం బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేపట్టాలన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం బస్సాపూర్‌లో సంపద వనాన్ని పరిశీలించారు. సంపద వనంలో పిచ్చిమొక్కలు తొలగించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఎంఈవో రాజేశ్వర్, తదితరులున్నారు.

విచారణ తర్వాతే కేసులు పెట్టాలి

- ఆర్టీసీ డ్రైవర్ల తప్పుంటేనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్



సన్మానం పొందిన డ్రైవర్లతో సీపీ కల్మేశ్వర్, ఆర్ఎం జానీరెడ్డి

ఖలీల్‌వాడి: ఆర్టీసీ డ్రైవర్ల తప్పులుంటేనే కేసులు నమోదు చేయాలని సీపీ కల్మేశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో ఆర్టీసీ డ్రైవర్లపై గల కేసుల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆర్టీసీ డ్రైవర్లపై కేసులు నమోదు చేసేటప్పుడు పూర్తి స్థాయి విచారణ జరిపిన తర్వాత కేసు నమోదు చేయాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సూచించారు. కార్యక్రమంలో డీసీపీ బి.కోటేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ టి. నారాయణ, ఆర్టీసీ ఆర్ఎం కె.జానీరెడ్డి, డిప్యూటీలు ఆర్ఎం వి.శంకర్, డిపో మేనేజర్లు ఎస్. ఆనంద్, పి.రవికుమార్, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు జాగ్రత్తగా బస్సులను నడపాలి

ఖలీల్‌వాడి: డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడిపించి ప్రయాణికులను గమ్యస్థానాలకు తీసుకెళ్లాలని సీపీ కల్మేశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్డులోని నిజామాబాద్–2 డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆర్టీసీ రోడ్డు సేఫ్టీ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వ్యక్తిగత సమస్యలున్నా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకూడదన్నారు. ప్రయాణికులు ఆర్టీసీపై నమ్మకంతో వస్తారని చెప్పారు. బస్సులు నడిపించే సమయంలో సెల్‌ఫోన్లను వాడకూడదన్నారు. ఒత్తిడితో పని చేయడం వల్లే ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. ఆర్ఎం జానీరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులు సురక్షిత ప్రాంతాలకు చేరవేస్తున్నామన్నారు. సిబ్బంది సహకారంతోనే సాధ్యమైందన్నారు. ప్రతియేటా ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించడం వల్ల డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం ఆర్టీసీ డ్రైవర్లకు సన్మానం చేశారు. ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు సరస్వతి, శంకర్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ పాల్గొన్నారు.

ఫోన్లు చేస్తూ.. బెదిరింపులకు పాల్పడుతూ..

సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతుల్లో ప్రజలను దోచేస్తున్నారు. ఇన్ని రోజుల పాటు ఫోన్లకు లింకు పంపుతూ, బ్యాంకు అధికారులమని చెబుతూ అకౌంట్లో నుంచి డబ్బులు కాజేసేవారు. ప్రస్తుతం రూటు మార్చారు. పోలీసు అధికారులమంటూ మీ కుటుంబ సభ్యులు పలు కేసుల్లో చిక్కుకున్నారంటూ ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. అంతేకాకుండా మరికొందరు విదేశాల్లో ఉన్న మీ కుటుంబీకులు మా ఆధీనంలో ఉన్నారని డబ్బులివ్వకపోతే చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. జిల్లాలో కొన్ని రోజులుగా ఈ తరహా ఘటనలు పెరుగుతున్నాయి. పోలీసులమని ఎవరైనా ఫోన్ చేస్తే అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ సూచనలు చేసింది.

రూ. 50వేలు ఇవ్వాలి.. లేదంటే నీ భర్తను చంపేస్తామంటూ..

మోర్తాడ్: ‘దుబాయ్‌లో ఉన్న నీ భర్త మా అదుపులో ఉన్నాడు.. అతనిని క్షేమంగా వదిలేయాలంటే రూ. 50వేలు ఇవ్వాలి.. లేదంటే చంపేస్తాం’ అని ఒక ఆగంతకుడు ఏర్గట్ల మండలం తడపాకల్‌కు చెందిన ఒక మహిళకు మంగళవారం ఫేక్‌కాల్ చేశారు. ఆమె వెంటనే అప్రమత్తమై పోలీసులను సంప్రదించగా భీమ్‌గల్ సీఐ నరేశ్‌యాదవ్, ఎస్సై మశ్చేందర్‌రెడ్డి స్పందించి విచారణ చేపట్టారు. సైబర్ నేరస్తులు ఫేక్ కాల్ చేశారని గుర్తించారు. ఇలా ఫోన్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సైబర్ నేరగాళ్లు అకౌంట్లో నుంచి డబ్బులు కాజేస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

- కొత్త పద్ధతుల్లో డబ్బులు కాజేస్తున్న నేరగాళ్లు
- పోలీసులమని ఫోన్లుచేస్తూ బెదిరింపులు
- మీ కుటుంబీకులను కిడ్నాప్ చేశామంటూ ఫోన్లు

పోలీస్ ఆఫీసర్ల పేరుతో ఫోన్‌చేస్తే స్పందించొద్దు

నిజామాబాద్‌క్రైం: సైబర్ నేరగాళ్లు పోలీసుల ఆఫీసర్ల పేరుతో ఫోన్‌చేస్తే స్పందించవద్దని సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ప్రజలను మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త విధానమని పేర్కొన్నారు. సైబర్ మోసాలపై స్నేహితులు, బంధువులు, చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

పోలీసులమని చెప్పి..

జక్రాన్‌పల్లి: పడకల్‌కు చెందిన బొంకుల రాములుకు ఈనెల 29న వాట్సప్ మాధ్యమం ద్వారా గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి.. ‘నేను పోలీసునని, నీ కొడుకు గంజాయి కేసులో అరెస్టయి పోలీస్ స్టేషన్ ఉన్నాడని’ చెప్పారు. ‘మీ కొడుకుపై కేసు నమోదైందని.. ప్రస్తుతం మా ఆధీనంలో ఉన్నాడని.. డబ్బులు పంపితేనే మీ కొడుకుని వదిలేస్తామని’ బెదిరించాడు. దీంతో రాములు ఫోన్‌చేసిన వ్యక్తికి రూ. 95వేలు ఫోన్‌పే చేశాడు. తర్వాత హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న కుమారుడు ప్రేమ్‌సాయికి ఫోన్‌చేయగా అలాంటిది ఏమీలేదని తెలిపాడు. దీంతో మోసపోయానని తెలుసుకొని మంగళవారం జక్రాన్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఖరారు కాని నీటి విడుదల షెడ్యూల్

- ఎస్సారెస్పీలోకి భారీగా వరద రాకపోవడమే కారణం
- కనీసం 50 టీఎంసీలు నిల్వ ఉంటేనే నీటి విడుదల



ఎస్సారెస్పీ ప్రస్తుత నీటిమట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటి విడుదల ప్రణాళిక ఇంకా ఖరారు కాలేదు. జూలై చివరి నాటికి కూడా అనుకున్నంత వరదనీరు రాకపోవడంతో ప్రాజెక్టు అధికారులు నీటి విడుదల ప్రణాళికపై దృష్టి సారించలేదు. డ్యాంలో ప్రస్తుతం 35 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కనీసం 50 టీఎంసీలు నిల్వ ఉంటేనే ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటివిడుదల చేపట్టే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. కానీ ఇప్పట్లో ప్రాజెక్టులోకి భారీ వరదలు వచ్చేలా కనిపించడంలేదు. ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలో వర్షాలు లేకపోవడంతో జలాశయంలోకి భారీ వరదలు రావడంలేదు. దీంతో ఆయకట్టు రైతులు సాగుపై సందిగ్ధంలో పడిపోతున్నారు.

సీజన్‌లో గరిష్టంగా 36వేల క్యూసెక్కులు..

పది రోజులుగా కురిసిన వర్షాల వలన ప్రాజెక్టులోకి గరిష్టంగా 36వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరింది. కానీ రెండు రోజుల్లోనే వరద నీరు తగ్గుముఖం పట్టింది. దీంతో వరద నీరుపై ఆయకట్టు రైతుల్లో రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుతూ, పెరుగుతూ వస్తోంది. కనిష్టంగా 16 వేల క్యూసెక్కులకు పడిపోయి, గరిష్టంగా 20 వేల క్యూసెక్కులకు చేరుతూ కొనసాగుతోంది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది.

గతేడాది ఇదే సమయానికి గేట్ల ఎత్తివేత

ప్రాజెక్టులోకి గతేడాది జూలై చివరిలో భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో జూలై 28న ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి మిగులు జలాలను వదిలారు. కానీ ప్రస్తుత ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ సంవత్సరం తాగునీటి అవసరాలు, ఆవిరి, డెడ్ స్టోరేజీలకు పోతే మిగిలేది 15 టీఎంసీల నీరు మాత్రమే ఉంటుంది. గతేడాది ఇదే సమయానికి 70 టీఎంసీలు దాటగానే ప్రాజెక్టు అధికారులు వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటి విడుదల చేపట్టారు. కానీ ఈ యేడు ఆ పరిస్థితి లేదు.

క్లుప్తంగా

బ్యూటీషియన్‌ కోర్సుకు మంచి డిమాండ్‌



డిచ్‌పల్లి: బ్యూటీషియన్‌ కోర్సుకు మార్కెట్‌లో మంచి డిమాండ్‌ ఉందని స్టేట్‌బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) డైరెక్టర్‌ సుంకం శ్రీనివాస్‌ అన్నారు. ఆర్‌ఎస్‌ఈటీఐలో నెలరోజులపాటు కొనసా గిన బ్యూటీపార్లర్‌ మేనేజ్‌మెంట్‌ కోర్సు మంగళవారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థినులకు ధ్రువపత్రాలతో పాటు టూల్‌కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. బ్యూటీపార్లర్‌ను సొంతంగా ఏర్పాటు చేసుకుని శిక్షణలో నేర్చుకున్న మెళకువలను పాటిస్తూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అవసరమైన వారికి బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది భాగ్యలక్ష్మి, రంజిత్‌, సరిత తదితరులు పాల్గొన్నారు.

‘భూసేకరణకు సహకరించండి’



మోర్తాడ్‌: జాతీయ రహదారి 64 విస్తరించనున్న నేపథ్యంలో బైపాస్‌ రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన భూ సేకరణ చేపట్టాల్సి ఉందని, రైతులు ఇందుకు సహకరించాలని ఆర్మూర్‌ ఆర్డీవో రాజుగౌడ్‌ కోరారు. మండల కేంద్రానికి చెందిన రైతులతోపాటు దొన్కల్‌, గాండ్లపేట్‌కు చెందిన రైతులతో మోర్తాడ్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న తెలియజేయాలని కోరారు. అలాగే నష్ట పరిహారం విషయంలో ఏవైనా విజ్ఞప్తులు ఉంటే వివరించాలని, ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రోడ్డు మార్గం డిజైన్‌ పూర్తి చేసిన నేపథ్యంలో భూ సేకరణ తప్పదని ఆర్డీవో స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్‌ సత్యనారాయణ, ఆర్‌ఐ రంజిత్‌కుమార్‌ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్‌, పీజీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు మంగళవారం 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల, న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పీజీ ఇంటిగ్రేటెడ్‌ 6, 8, 7, 9, 10వ సెమిస్టర్‌, పీజీ 1, 3వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 27 మంది విద్యార్థులకు 17 మంది హాజరైనట్లు ప్రొఫెసర్‌ చంద్రశేఖర్‌ తెలిపారు.

డిగ్రీ వన్‌టైం చాన్స్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలు..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్‌ బ్యాక్‌లాగ్‌ 5, 6వ సెమిస్టర్‌ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (నిజామాబాద్‌), ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ డిగ్రీ కాలేజ్‌ (కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌(ఆర్మూర్‌) పరీక్షా కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షకు 16 మంది విద్యార్థులకు గాను 15 మంది హాజరైనట్లు తెలిపారు.

దుకాణాల్లో షీటీం తనిఖీలు

రుద్రూర్‌: ఆపరేషన్‌ ముస్కాన్‌ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని దుకాణాల్లో షీటీం సభ్యులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మైనర్లను పనిలో పెట్టుకోవద్దని వ్యాపారులకు సూచించారు. తనిఖీల్లో షీటీం లీడర్‌ షాకియా బేగం, మమత, హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌, చైల్డ్‌ ఆఫీసర్‌ ముజీబ్‌ తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్లను కొల్లగొడుతున్న సైబర్‌ నేరగాళ్లు

డొంకేశ్వర్‌ మండలం నూత్‌పల్లి గ్రామంలోని యూనియన్‌బ్యాంక్‌ పరిధిలో సైబర్‌నేరగాళ్ల చేతిలో ముగ్గురు మోసపోయారు. రైతుబంధు జమ అయినట్లు ఓ వ్యక్తికి మెసేజ్‌ రావడంతో దాన్ని ఓపెన్‌ చేసిన వెంటనే ఖాతా నుంచి రూ.5,36,700 మాయమయ్యాయి. అలాగే గంగాసముందర్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుతూరి పెళ్లి కోసం నగదును బ్యాంక్‌లో జమ చేసుకున్నాడు. అయితే అతడి ఫోన్‌కు యూనియన్‌ బ్యాంక్‌ లోగోతో మెసేజ్‌ రావడంతో దాన్ని ఓపెన్‌చేసిన తరువాత దఫాలుగా రూ.4,16,930 సైబర్‌నేరగాళ్లు విత్‌డ్రా చేసుకున్నారు.

డొంకేశ్వర్‌ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఉద్యోగి ఇన్‌స్టాగామ్‌లో స్టాక్‌ మార్కెట్‌ ప్రకటనను చూసి వాట్సాప్‌ ద్వారా సంప్రదించాడు. అత్యాశకు పోయిన ఉద్యోగి మొత్తం రూ.35.87 లక్షలు మోసపోయి సైబర్‌ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కమ్మర్‌పల్లి మండలంలోని ఓ ఆర్‌ఎంపీ సోషల్‌మీడియాలో వచ్చిన ఫ్రాంఛైజీ ప్రకటను చూసి అవతలి వ్యక్తిని సంప్రదించగా, సైబర్‌నేరగాళ్లు అతడిని నమ్మించి రూ.5.86 లక్షలు వసూలు చేశారు. చివరకు తాను మోసపోయాయని గ్రహించిన సదరు ఆర్‌ఎంపీ ఆర్‌ఎంపీ పోలీసులను ఆశ్రయించాడు.

- లింక్‌లు ఓపెన్‌ చేస్తే డబ్బులు మాయం
- సోషల్‌ మీడియాలో డబ్బు ఆశ చూపుతూ మోసాలు
- జిల్లాలో పెరుగుతున్న కేసులు



ఖలీల్‌వాడి: ఇంటర్నెట్‌ విస్తృతంగా అందుబాటులోకి వచ్చి ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ ఫోన్‌లు మామూలు విషయమైన ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్‌నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. మొబైల్‌ ఫోన్‌కు లింకులు పంపుతూ బ్యాంక్‌ అకౌంట్లను కొల్లగొడుతున్నారు. లోన్లు, ఆఫర్లు, ఉద్యోగ అవకాశాలు, లక్కీడ్రా, బ్యాంకు కేవైసీ.. ఇలా ఏదో ఒకటి చెబుతూ అమాయకులను దోచేస్తున్నారు. వాట్సాప్‌, ఫేస్‌బుక్‌ మాధ్యమాలను వేదికగా చేసుకొని ఫోన్‌లను హ్యాక్‌ చేస్తున్నారు. బ్యాంకులు, కార్పొరేట్‌ సంస్థల లోగోలతో మొబైల్‌ ఫోన్లకు ఏపీకే ఫైళ్లు, లింకులు పంపుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. రైతులను పీఎం కిసాన్‌ సమ్మాన్‌, రైతుభరోసా పేరుతో మోసం చేస్తున్నారు. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అనే తేడాలేకుండా మోసపోతున్నారు. డిజిటల్‌ లావాదేవీలు, గేమింగ్‌యాప్‌లు సైబర్‌నేరగాళ్లకు వరంలా మారాయి.

తీసుకోవాల్సిన జాగ్రతలు..

- సెల్‌ఫోన్లకు వచ్చే లింకులను పూర్తిగా నిర్ధారణ చేసుకున్న తరువాతే ఓపెన్‌ చేయాలి.
- డిజిటల్‌ చెల్లింపులు, బ్యాంక్‌ ఖాతాల్లో నగదు తక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- గూగుల్‌లో సెర్చ్‌ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ఎటువంటి లింకులను ఓపెన్‌ చేయొద్దు.
- గుర్తు తెలియని ఫోన్‌ నెంబర్ల నుంచి గాని లేదా వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఫోన్‌లను లిఫ్ట్‌ చేసి బ్యాంక్‌ వివరాలు, ఓటీపీ, ఆధార్‌, పాన్‌కార్డుల వివరాలను చెప్పొద్దు.
- సైబర్‌ నేరాలకు గురైనవారు వెంటనే 1930 లేదా cybercrime.gov.inకు ఫిర్యాదు చేయాలి.
- సైబర్‌ మోసానికి గురైన గంటలోపు ఫిర్యాదు చేస్తే సైబర్‌ పోలీసులు ఆ లింక్‌ ద్వారా బ్యాంక్‌ ఖాతాలను ఫ్రీజ్‌ చేసే అవకాశం ఉంటుంది.
- జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లలో రూ.1000 నుంచి రూ.7 లక్షల వరకు మోసాలకు సంబంధించిన ఫిర్యాదు చేయాలి. రూ.7 లక్షలు, ఆపై మోసాలకు సంబంధించిన ఫిర్యాదులను సైబర్‌ క్రైం పోలీస్‌స్టేషన్‌లో చేయాలి.

సైబర్‌ వారియర్లను నియమించాం

జిల్లాలోని పోలీస్‌ స్టేషన్‌లో సైబర్‌ వారియర్లను నియమించాం. సైబర్‌ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫోన్‌ చేసి ఫిర్యాదు చేయాలి. స్మార్ట్‌ఫోన్‌కు వచ్చే లింక్‌లను ఓపెన్‌ చేయొద్దు. సంస్థలు పంపే లింకులను నిర్ధారణ చేసుకున్న తరువాతే ఓపెన్‌ చేయాలి. జాగ్రత్తగా ఉంటే సైబర్‌ నేరగాళ్ల ఉచ్చు నుంచి తప్పించుకోవచ్చు. ప్రతి బుధవారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, సైబర్‌ క్రైం, ఏసీపీ, నిజామాబాద్‌

విజృంభిస్తున్న వైరల్‌ జ్వరాలు

- పెరుగుతున్న డెంగీ కేసులు
- జీజీహెచ్‌కు పెరిగిన రోగుల తాకిడి.. వైద్యుల కొరతతో ఇక్కట్లు
- కిక్కిరుస్తున్న ప్రైవేట్‌ ఆస్పత్రులు

నిజామాబాద్‌నాగారం: సీజనల్‌ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో చిన్నాపెద్ద తేడాలేకుండా జ్వరాలబారిన పడుతున్నారు. ఓ వైపు వైరల్‌ జ్వరాలు కలవరపెడుతుండగా, మరో వైపు డెంగీ కేసుల సంఖ్య పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగా వైద్యులు లేకపోవడంతో రోగుల పరిస్థితి దారుణంగా మారింది. కేవలం వారం రోజుల్లోనే 15 డెంగీ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. సీజనల్‌ వ్యాధులు ప్రబలుతున్న వేళ జీజీహెచ్‌కు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. ఇక ప్రైవేట్‌ ఆస్పత్రులు కిక్కిరుస్తున్నాయి. డెంగీ పేరుతో యథేచ్ఛగా దోచుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత నాలుగు రోజులుగా జిల్లాలో జ్వర బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చలి జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, దగ్గు, వాంతులు, విరేచనలతో ప్రజలు అల్లాడుతున్నారు. చిన్నాపెద్ద తేడాలేకుండా అందరూ జ్వరాల బారిన పడుతున్నారు. చికిత్స కోసం గ్రామాల్లో, పట్టణాల్లో ముందుగా ఆర్‌ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నా ఫలితం ఉండకపోవడంతో వారిని ప్రైవేట్‌ ఆస్పత్రులకు రిఫర్‌ చేస్తున్నారు. ఇదే అదునుగా ప్రజల నుంచి ప్రైవేట్‌ ఆస్పత్రులు అందినకాడికి దండుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. డెంగీ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఓ వ్యక్తికి డెంగీ నిర్ధారణ కావాలంటే ఎలీజా టెస్ట్‌ తప్పనిసరి. ఆ సౌకర్యం కేవలం ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి ఆవరణలోని టీహబ్‌లో మాత్రమే ఉంది. ప్రైవేట్‌ ఆస్పత్రులు కేవలం ఎన్‌ఎస్‌-1 టెస్ట్‌ చేసి డెంగీ పాజిటివ్‌ వచ్చిందని హంగామా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

వారం రోజుల్లో నమోదైన వైరల్‌, డెంగీ కేసులు

తేదీ	వైరల్‌ఫీవర్‌	డెంగీ
23	15	02
24	122	06
25	197	01
26	245	06
27	207	00
28	205	00
మొత్తం	991	15

ప్రైవేట్‌లో డెంగీ నిర్ధారణ చేయొద్దు

డెంగీ, వైరల్‌ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షల విషయంలో ఎన్‌ఎస్‌-1 టెస్ట్‌ చేసి డెంగీ పాజిటివ్‌ అని చెప్పి వైద్యం చేయొద్దు. డెంగీ పరీక్షలు టీహబ్‌లో మాత్రమే ఎలీజా టెస్ట్‌తో సాధ్యమవుతుంది. అనవసరంగా ప్రజలను, రోగులను ఇబ్బందులకు గురి చేయొద్దు. ఇబ్బందులకు గురి చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలుతీసుకుంటాం.

– తుకారాంరాథోడ్‌, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

రోజుకు వంద ఇళ్లను సందర్శించాలి

నిజామాబాద్‌నాగారం: ప్రతి రోజూ సిబ్బంది వంద ఇళ్లను సందర్శించి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌ సూచించారు. డెంగీ నివారణ చర్యలపై యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందికి నగరంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆగస్టు 1 నుంచి ఐదు నెలలపాటు ప్రతిరోజూ ఇళ్ల పరిసరాల పరిశీలన కొనసాగాలన్నారు. అర్బన్‌హెల్త్‌ సెంటర్ల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌

ఆయిల్‌పామ్‌ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



మెగా ఆయిల్‌పామ్‌ ప్లాంటేషన్‌ డ్రైవ్‌లో పాల్గొన్న సంధ్యారాణి

- ఉద్యాన శాఖాధికారి సంధ్యారాణి

డిచ్‌పల్లి: ప్రభుత్వం ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ఆయిల్‌పామ్‌ మొక్కల సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉద్యాన శాఖ అధికారి సంధ్యారాణి సూచించారు. ఆయిల్‌పామ్‌ తోటల విస్తీర్ణ పథకంలో భాగంగా మంగళవారం బీబీపూర్‌ శివారులోని నల్ల దినేష్‌రెడ్డికి చెందిన 8 ఎకరాల తోటలో మెగా ఆయిల్‌పామ్‌ ప్లాంటేషన్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ప్రీయూనిక్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ క్లస్టర్‌ అధికారి టి.భూమేశ్‌, రైతులతో కలిసి సంధ్యారాణి ఆయిల్‌పామ్‌ మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్‌పామ్‌ పంట సాగుకు రాయితీ(సబ్సిడీ) ఇస్తుందన్నారు. ఆయిల్‌పామ్‌ మొక్క ధర రూ.193 కాగా రైతు వాటా రూ.20 సబ్సిడీ పోను 50 మొక్కలకు రూ.8,650(యూనిట్‌) చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఆయిల్‌పామ్‌ పంట సాగుకు అవసరమైన డ్రిప్‌ ఇరిగేషన్‌ సిస్టమ్‌కు రూ.19,482లు ఉండగా ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ, చిన్న, సన్నకారు రైతులకు రూ.90 శాతం ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీ ఇస్తారని తెలిపారు. మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటకు, ఆయిల్‌పామ్‌ తోట నిర్వహణ కోసం ఖర్చులకు రూ.4,200 నగదు రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు. ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన వినయ్‌రెడ్డి



బాధితుడితో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

మాక్లూర్‌: రోడ్డు ప్రమాదంలో గాయపాలైన మండలంలోని రామస్వామి క్యాంప్‌నకు చెందిన అరుణ్‌, దీపను ఆర్మూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. వివరాలు ఇలా ఉన్నాయి..

అరుణ్‌, దీప డీఎస్సీ పరీక్ష రాసేందుకు మంగళవారం సిద్దిపేటకు తమ పిల్లలతో కలిసి కారులో వెళ్తుండగా రామాయంపేట్‌ వద్ద బస్సును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వినయ్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని బాధితులను అమీర్‌పేట్‌లోని వెల్‌నెస్‌ ఆస్పత్రికి తరలించారు. దగ్గరుండి వారికి చికిత్స చేయించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- కలెక్టర్‌కు బీజేపీ ఓబీసీ మోర్చా వినతి
- కలెక్టరేట్‌ ఎదుట ధర్నా



నిరసన తెలుపుతున్న బీజేపీ ఓబీసీ నాయకులు

సుభాష్‌నగర్‌: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, అందుకు సరిపడా నిధులు కేటాయించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యామాద్రి భాస్కర్‌ మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 50శాతానికిపైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం రూ.9,200 కోట్లు మాత్రమే కేటాయించారని, కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్‌ అమలుకు అవసరమైన రూ.50వేల కోట్లు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. బీసీల రిజర్వేషన్లను 42శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. జ్యోతిరావు పూలే బీసీ సబ్‌ ప్లాన్‌ ఏర్పాటు చేసి ఏడాదికి రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని హామీనిచ్చి 8 నెలలు గడుస్తున్నా.. ఇంతవరకూ కేటాయించలేదని విమర్శించారు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు న్యాలం రాజు, పోతన్‌కర్‌ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు ఇప్పకాయల కిశోర్‌, కోడూరి నాగరాజు, యాదగిరి, మాస్టర్‌ శంకర్‌, రచ్చ సుదర్శన్‌, సురేశ్‌బాబు, కార్పొరేటర్లు మెట్టు విజయ్‌, పంచరెడ్డి ప్రవళిక, నాయకులు సంతోష్‌, కృష్ణగౌడ్‌, వినోద్‌, ఆప్కారి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



అంబులెన్స్‌లో బాధితులు

వర్ని: ద్విచక్ర వాహనానికి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి అడ్డువచ్చిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వర్ని పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని జలాల్‌పూర్‌ గ్రామ శివారులో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది.సాలూర గ్రామానికి చెందిన సిద్ధు, హేమ ద్విచక్ర వాహనంపై బడాపహాడ్‌ వెళ్తుండగా, నడుచుకుంటూ వెళ్తున్న ఆరిఫ్‌ అనే వ్యక్తి అడ్డువచ్చాడు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలుకాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో మహిళకు ..



గాయాలపాలైన సురేఖ

వర్ని: విద్యుత్‌షాక్‌ తగిలి మండలంలోని బేలియానాయక్‌ తండాకు చెందిన అజ్మీరా సురేఖకు తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం ఉదయం సురేఖ ఇంటిపై బట్టలు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌ తీగలు తగిలి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఇళ్ల పైనుంచి ఉన్న విద్యుత్‌ తీగలను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని, వారి నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొతంగల్‌లో వ్యక్తి దారుణహత్య



ఘటనాస్థలంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు



లాలయ్య (ఫైల్‌)

రుద్రూర్‌: పొతంగల్‌ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మేత్రి లాలయ్య అలియాస్‌ లాలబోయి(58) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో తలపై బాది హత్య చేసి పారిపోయారు. మంగళవారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌, రుద్రూర్‌ సీఐ జయేశ్‌రెడ్డి, కోటగిరి, వర్ని ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. డాగ్‌ స్క్వాడ్‌ను రప్పించారు. లాలయ్య సోదరుడు మేత్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివిధ కోణాల్లో విచారణ

గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పని చేసిన లాలయ్య కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పక్షవాతం రావడంతో కొంత కాలంగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇద్దరు భార్యలు, ఐదుగురు సంతానం కాగా, హత్య జరిగిన రాత్రి వీరంతా మరో ఇంట్లో ఉండగా, లాలయ్య ఓ ఇంట్లో ఉన్నాడు. హత్య జరిగిన రాత్రి లాలయ్య వద్ద కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్యలో కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందా? బయటి వ్యక్తులు హత్య చేశారా? అనే కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యుల్లో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వోపై మంత్రికి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో కల్లు డిపో అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వో దిలీప్‌ వారికి వత్తాసు పలుకుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నగరానికి చెందిన పలువురు వాట్సాప్‌లో ఫిర్యాదు చేశారు. బైలాస్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తూ వేరే జిల్లా వారికి సభ్యులుగా అవకాశం కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డిపో పరిధిలోని కల్లుదుకాణంలో మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్న ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేయలేదని, విషయం బయటికి రావడంతో ఆ తరువాత కేసు నమోదు చేశారని తెలిపారు. మూడో డిపోలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి ఎస్‌హెచ్‌వో దిలీప్‌తోపాటు మూడో డిపో నిర్వాకులపై పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్‌

భిక్కనూరు: గంజాయి కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. ఆదిలాబాద్‌ జిల్లా గుట్ట పక్కతండాకు చెందిన సకర్వాల్‌ హరిసింగ్‌ గంజాయి తీసుకొని మండలంలోని బీటీఎస్‌ వద్దకు సోమవారం అర్ధరాత్రి రాగా, దానిని కొనుగోలు చేసేందుకు బీబీపేట మండలం తుజాల్‌పూర్‌ గ్రామానికి చెందిన రోహిత్‌గౌడ్‌, బీబీపేట మండలం యాడారంకు చెందిన వడ్ల వంశీ అక్కడికి వచ్చారు. పక్కా సమాచారం మేరకు అక్కడికి చేరుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద గంజాయి లభించిందని ఎస్సై తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.3,375 ఉంటుందని, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషల్‌ కస్టడీ విధించారని, నిజామాబాద్‌ జైలుకు తరలించామని ఎస్సై తెలిపారు.

దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

బాన్సువాడ: బీర్కూర్‌, నస్రుల్లాబాద్‌, కోటగిరి మండలాల పరిధిలో సర్వీస్‌ వైర్లు, బావి దగ్గర మోటార్లు, సెంట్రింగ్‌ డబ్బాలు మొదలైనవి దొంగతనం చేసిన ముఠాను అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణ గౌడ్‌ తెలిపారు. మంగళవారం బీర్కూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో బీర్కూర్‌కు చెందిన ఏడు కొండలు, గోపనపల్లి పాషా, అరుణ్‌ అనే ముగ్గురు వ్యక్తులను హాజరు పరిచారు. వారి నుంచి దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. నిందితులను బాన్సువాడ మెజిస్ట్రేట్‌ ముందు హాజరు పరిచి రిమాండ్‌ చేసి నిజామాబాద్‌ జైలుకు పంపారు.

మద్యంకోసం వెళ్లి శవమయ్యాడు

ఖలీల్‌వాడి: వైన్‌షాప్‌నకు వెళ్లిన వృద్ధుడు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాయినగర్‌కు చెందిన గంగారాం(65) ఆదివారం సాయంత్రం వైన్‌షాపునకు వెళ్తున్నా నని ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు.గంగారాం తిరిగిరాకపోవడంతో కు టుంబ సభ్యులు పలుచోట్ల వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు.మంగళవారం భవన నిర్మాణ పనులకు వెళ్తున్న మేస్త్రీలు పనికి వెళ్తుండగా గుంత లో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని గంగారాంగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఫిట్స్‌తో యువకుడు..

మాచారెడ్డి: ఫిట్స్‌ వచ్చిన యువకుడు నీటిగుంతలో పడి మృతి చెందిన సంఘటన పాల్వంచ మండలం ఇసాయిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కోలాపురం రాజు (35) తండ్రి రాజయ్యతో కలిసి సోమవారం గ్రామ శివారులోని గుడ్డేలుగుల గుట్టకు పశువులను మేపేందుకు వెళ్లాడు. తండ్రి పశువులను తోలుకొని ముందు వస్తుండగా, రాజు వెనుక బయల్దేరాడు. ఇంటికి చేరుకున్న తండ్రికి తన కొడుకు కనిపించకపోవడంతో ఆందోళన గురయ్యాడు. గ్రామస్తులను వెంటబెట్టుకొని గుట్ట ప్రాంతానికి వెళ్లి గాలిస్తున్న క్రమంలో రాత్రి 11 గంటల ప్రాంతంలో ఓ నీటి గుంతలో రాజు మృతదేహం కనిపించింది. ఫిట్స్‌ రావడంతో నీటిగుంతలో పడి రాజు మృతి చెంది ఉంటాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దుబాయిలో యువకుడి ఆత్మహత్య

మాచారెడ్డి: మండలంలోని సిక్కులోని లొద్ది తండాకు చెందిన ఓ యువకుడు దుబాయిలో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన యువకుడు గుగులోత్‌ నరేశ్‌(23) ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం అప్పుచేసి దుబాయికి వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకకపోగా, చేసిన పనికి డబ్బులు రాకపోవడంతో నరేశ్‌ మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు మృతి వార్త తెలుసుకున్న నరేశ్‌ తల్లిదండ్రులు అరుణ, దేవ్‌ కన్నీరుమున్నీరవుతున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.



నరేశ్‌ (ఫైల్‌)

మద్యానికి బానిసై ..

ఎడపల్లి(బోధన్‌): మద్యానికి బానిసై మండలంలోని కుర్నాపల్లికి చెందిన మామిడి చిన్నసాయిలు (36) అనే వ్యక్తి మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. మద్యానికి బానిసైన చిన్నసాయిలు అనేక మంది అప్పులు చేయడంతోపాటు తరుచుగా భార్యను వేధించేవాడన్నారు. వేధింపులను భరించలేక అతడి భార్య పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. మద్యం మత్తులో ఇంట్లో ఉన్న చిన్నసాయిలు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు.